# ముందుజాగ్రత్త

"మిస్ మంజులా నాలుగు అర్జంట్ లెటర్స్ వున్నాయి. డిక్టేషన్ తీసుకుంటారా? నా స్టెనో యీరోజు రాలేదు" అంటూ మంజుల సీటు వద్దకు వచ్చి అడిగేడు జూనియర్ మేనేజర్ మాధవరావు.

"చూడండి మిస్టర్! ఆవిడ టైపిస్ట్! స్టెనో కాదు మీ దగ్గర డిక్టేషన్స్ తీసుకోడానికి డ్రాఫ్ట్ రాసి పంపించండి టైప్ చేస్తుంది " అంది సత్యభామ.

మాధవరావు తృళ్ళిపడ్డాడు సత్యభామ మాటలకు.

"అది కాదండీ.., మంజులగారికి షార్ట్‌హేండు వచ్చుకదా! అందుకని అడిగేను..."

"ఆవిడకే కాదు నాకూ వచ్చునిమీకు తెల్సు కదా! మరి నన్నడగ లేదేం?"

"మీరు లోగడ బ్లంట్‌గా చెప్పేరు కదా! నేను టైపిస్ట్‌ని కనుక టైపింగ్ వర్క్ మాత్రమే చేస్తాను. స్టెనోని కాదు కనుక డిక్టేషన్స్ తీసుకోను" అని.

"అవును కదా! ఆవిడ కూడా అంతే! టైపిస్ట్ కనుక డిక్టేషన్స్ తీసుకోదు" అంది కాస్త కటువుగా.

మాధవరావు వదనం చిన్నబోయింది.

"సారీ!" అంటూ తలవంచుకొని తన కేబిన్‌లోకి వెళ్ళిపోయేడు.

మాధవరావు అవస్థ చూసి కొద్దిగా బాధపడింది మంజుల.

మాధవరావుది మంచి పర్సనాల్టీ. ఆడవాళ్ళను ఆకట్టుకొనే అందం, ఎప్పుడూ నీట్‌గా వుంటాడు. బ్రహ్మచారి.

"ఏమిటి సత్యా! మరీ అంత రూడ్‌గా సమాధానం చెప్పేవు..." అంటూ యింకా ఏమో చెప్పబోయింది మంజుల.



"వీళ్ళ సంగతి నీకింకా తెలియదు మంజూ! సమయం దొరికినప్పుడు మనం ఉపేక్షించకూడదు. లేకుంటే వెధవ్వేషాలు వేస్తారు తెలుసా!" అంది సత్యభామ ఆవేశంగా.

మంజుల జాబ్‌లో చేరి వారం రోజులే అవడం వల్ల ఆమెకు ఎవరి గురించీ అంతగా తెలియదు కనుక ఆ విషయం మరి ప్రస్తావించలేదు.

మంజుల, సత్యభామ ఒకే యీడువారు. ఒకే వీధిలో వుంటున్నారు, సత్యభామ టెన్త్ పాసయి, టైపూ షార్ట్‌హేండూ పాసయి ఒక ప్రైవేట్ కంపెనీలో టైపిస్ట్ జాబ్ చేస్తోంది. మంజుల బి.కాం, డిగ్రీ పుచ్చుకుని టైపూ షార్ట్‌హేండూ పాసైంది. సత్యభామ పని చేస్తున్న కంపెనీలో మరొక టైపిస్ట్ పోస్ట్ వేకెన్సీ వస్తే ఆ జాబ్ మంజులకి తన పలుకుబడితో యిప్పించింది సత్యభామ.

మంజుల మంచి నాజూగ్గానూ, ఎంతో అందంగా వుంటుంది. సత్యభామ అందకత్తె

కాకపోయినా చురుకైన వ్యక్తి.

ఓ ఆదివారం సాయంత్రం మంజుల తన తమ్ముడు గోపీని తీసుకొని బజారుకి బయల్దేరింది.

దారిలో స్కూటర్ మీద వస్తున్న మాధవరావును, అతని వెనుక కూర్చుని మాధవరావు నడుంచుట్టూ చేతులు వేసి నవ్వుతూ కబుర్లు చెప్తున్న సత్యభామను చూసింది.

సత్యభామ, మాధవరావులు ప్రేమికులని, అయితే తన ప్రియుడి దృష్టి మరే అమ్మాయి మీద పడకుండా ఎంతో నేర్పుతో సత్యభామ కవర్ చేసుకొస్తున్న విషయం గ్రహించిన మంజుల ఆశ్చర్యంగా వాళ్ళవైపే చూస్తూ వుండిపోయింది.

**('ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక', ఆగస్టు 2000)** ✪